నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 13 జూన్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

మోగిన బడి గంట

బడిగంట కొడుతున్న సిబ్బంది

వనపర్తిలో పాఠశాలలోకి పరుగులు పెడుతున్న విద్యార్థులు

పాలమూరులో పాఠశాలకు వస్తున్న విద్యార్థినులు

వనపర్తిలో విద్యార్థులకు పువ్వులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

- విద్యార్థులకు పూలు అందించి స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- మొదటి రోజు అంతంత మాత్రమే పాఠశాలకు విద్యార్థుల హాజరు
- తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశాలు
- పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/వనపర్తి టౌన్, జూన్ 12 : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది. విద్యార్థులు ఉల్లాసంగా.. ఉషారుగా పాఠశాలలకు రావడం కన్పించింది. తన స్నేహితులతో సరదాగా మాట్లాడుతూ వేసవి సెలవులను ఎలా గడిపారో ఒకరికి ఒకరు చెప్పుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. చాలా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు చాలా పలుచగా, మరి కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల కంటే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా కన్పించింది. ఇంకొన్ని పాఠశాలకు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు పూలతో స్వాగతం పలికారు. పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి కొత్త అడ్మిషన్లతో హడావుడి కనిపించింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మోడ్రన్ హైస్కూల్‌లో బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం, పాఠశాలల పునః ప్రారంభోత్సవం, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం, న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి వి.ఈశ్వరయ్య హాజరయ్యారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.


పెద్ద ధన్వాడ వద్ద ఫ్యాక్టరీ నిర్మించే చుట్టుపక్కల ప్రాంతంలో సాగు చేసిన భూములు

రైతుల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహావేశాలు

అగ్నికి.. ఆజ్యం

- ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టొద్దంటూ రైతుల ఆందోళన
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన
- కంపెనీ పనులు అడ్డుకుంటామని బాధిత గ్రామాల ప్రజల స్పష్టీకరణ

గద్వాల, జూన్ 12 : జోగుళాంబ గద్వాల జిల్లాలోని రాజోళి మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపడితే బంగారు పంటలు పండే భూములు నాశనం కావడం తోపాటు, నీరు కలుషితమై, ప్రజలు, మూగజీవాలు రోగాల బారిన పడ తాలని, పచ్చని పంటలు, పల్లెలను నాశనం చేసే ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం మా గ్రామాల పరిధిలో ఏర్పాటు చేయవద్దంటూ ఓ వైపు 12 గ్రామాల రైతులు, ప్రజలు ఏకతాటిపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. అయితే కంపెనీ యజమాన్యం పోలీసు అధికారులు కవ్వింపు చర్యలకు పాల్పడడం తోపాటు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో వారు తిరగబడ్డారు. దీంతో విధి లేని పరిస్థితుల్లో కంపెనీ యాజమాన్యం అక్కడ నుంచి క్యాంప్ ఖాళీ చేసి వెళ్లి పోయింది. ఇక కంపెనీ పీడ పోయిందని, గ్రామాల్లోని ప్రజలు ప్రశాంతంగా ఉంటూ తమ పొలాల్లో విత్తులకు సిద్ధమవుతున్న వేళ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఇథనాల్ ఫ్యాక్టరీ పెట్టుడే అని మంగళవారం బాంబు పేల్చారు. దీంతో ఆయా గ్రామల ప్రజలు మంత్రి మాటలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ప్రజల మద్దతు లేనిది ఎలా ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తారో మేము చూస్తామని అంటున్నారు. గ్రామసభలు పెట్టకుండా, ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం తోపాటు పాలకులు యాజమాన్యానికి కొమ్ము కాస్తే చూస్తు ఊరు కోమని 12 గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఒక సారి యాజమాన్యం బౌన్సర్లను తీసు కొచ్చి రైతులను, ప్రజలను కొట్టించే ప్రయత్నం చేస్తే ఎటువంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో మంత్రి ఆలోచించాలన్నారు.

రైతులపై దౌర్జన్యం..

బౌన్సర్లతో కంపెనీ యాజమాన్యం రైతులను కొట్టించే ప్రయత్నం చేయడం, వారికి పోలీసులు సహకరించడంతో కోపోద్రిక్తులైన రైతులు కంపెనీ యాజమాన్యంపై తిరగబడడంతో 40 మందిపై కేసులు నమోదు చేసి 12మంది రైతులను జైలుకు పంపారు. మరోసారి మంత్రి రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. మంత్రి మాటలు రైతులను రెచ్చగొట్టి విధంగా, రైతులు తప్పు చేస్తే వారిని మరో సారి జైలుకు పంపి పనులు ప్రారంభించేలా ప్లాన్ చేసినట్లు తెలుస్తుందని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. పెద్దధన్వాడలో ఇథనాల్ ప్లాంటును ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేస్తామని, ఇందుకు ఎలాంటి అడ్డంకులు లేవని, కొద్ది రోజులు ఆలస్యం అవుతుందే తప్పా ప్లాంటు ఏర్పాటు ఖాయమని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించడంపై రైతులు ఆయనపై ఆక్రోశంతో ఉన్నారు. ఎటువంటి అడ్డంకులు లేవని ఎవరు చెప్పారని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు మంత్రిని ప్రశ్నిస్తున్నారు. 12గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ వద్దని వ్యతిరేకిస్తుంటే.. ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పడం దేనికి సంకేతం, వీరి మాటలు వేల మంది రైతుల ప్రయోజనాలు, ఒక ఫ్యాక్టరీ యజమానికి తాకట్టు పెట్టినట్లు ఉందనేది ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటుపై మంత్రితోపాటు ప్రభుత్వానికి ఎందుకు అంత ప్రేమ అనే ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారు ఎందుకు కంపెనీ యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారనేది అంతు చిక్కని ప్రశ్నగానే మిగులుతుంది. మంత్రి శ్రీధర్‌బాబు మాటలపై పెద్దధన్వాడ ప్రజల ఆగ్రహం వారి మాటల్లోనే..

మమ్మల్ని చంపి ఫ్యాక్టరీ ఏర్పాటు చేయండి..

మా ఊరిలో ఉన్న మమ్మల్ని అందరినీ చంపిన తర్వాతే మంత్రి ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకొమను. రాత్రి, పగలు కష్టపడి పంటలు పండించుకొని పొట్ట పోసుకుంటోళ్లం. మాపొట్ట మీద కొట్టడం ఎంతవరకు న్యాయం. మాకు ఆ ఫ్యాక్టరీ వద్దు. ఎట్టి పరిస్థితుల్లో ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టవద్దు. మా పిల్లల భవిష్యత్ మాకు ముఖ్యం. ఫ్యాక్టరీ నిర్మాణంపై ప్రభుత్వానికి ఎందుకంత ప్రేమ. వద్దంటే ఏర్పాటు చేస్తామనడంలో వారికి రైతులపై ఎంత ప్రేమ ఉందో తెలుస్తుంది.

- ఓబులేశు, రైతు, పెద్దధన్వాడ, జోగుళాంబ గద్వాల

మా కడుపు కొట్టే ఫ్యాక్టరీ మాకొద్దు

మా పంట పొలాలు నాశనం చేయడంతో పాటు, ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేసే ఈ ఫ్యాక్టరీ మాకొద్దు. ప్రాణాలు పోయినా ఫర్వాలేదు కానీ ఫ్యాక్టరీ నిర్మాణం అడ్డుకుంటాం. బెటాలియన్‌ను దింపుకొంటారో, పోలీసులను ఎంత మందిని దింపుకొంటారోదింపుకోమనండి. ఫ్యాక్టరీ నిర్మాణం పక్కనే దళితులకు 150 ఎకరాల భూమి, ప్లాట్లు ఇచ్చారు. వారు ఎక్కడికి పోవాలి. 40 మంది మీద కేసులు చేశారు. ఇంకా ఎంతమంది మీద కేసులు చేస్తారో చేయమనండి. ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని మంత్రి, కంపెనీ యాజమాన్యం అనుకుంటే సరి పోతుందా, మా ఆవేదన వారికి అవసరం లేదా? ఈ ప్రభుత్వం ఎవరి పక్షాన పనిచేస్తుందో సమాధానం చెప్పాలి.

- శ్రీను, రైతు, పెద్ద ధన్వాడ, జోగుళాంబ గద్వాల

ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

అయిజ, జూన్ 12 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. గురువారం జూరాలకు ఇన్‌ఫ్లో 14,500 క్యూసెక్కులు నమోదు కాగా నెట్టెంపాడ్ ఎత్తి పోతల పథకం 1,500, కోయిల్‌సాగర్ లిఫ్టుకు 315, విద్యుత్ ఉత్పత్తికి 7,469 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అవుట్ ఫ్లో 9,352 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318.516 అడుగులు కాగా, ప్రస్తుతం 318.070 ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 8.750 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కర్ణాటకలో కురుస్తున్న మోస్తరు వానలకు తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 6,180 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 96 క్యూసెక్కులు నమోదైంది. గరిష్ఠనీటి మట్టం1633 అడుగులకు గానూ ప్రస్తుతం 1602.47 అడుగుల నీటిమట్టం ఉండగా, 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 24.886 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద చేరుతోంది. ఇన్‌ఫ్లో 4,329 క్యూసెక్కులు ఉండగా, దిగువన ఉన్న సుంకేసుల బారాజ్‌కు 3,879 క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుతం 8.6 అడుగుల మేర నీటి మట్టం ఉంది.

సంకల్పబలంతో ముందుకు సాగాలి

- పీయూ వీసీ శ్రీనివాస్
- కొనసాగుతున్న టీజీపీఈ సెట్ ఎంపికలు

పరుగుపందెం పోటీలను ప్రారంభిస్తున్న విద్యామండలి వైస్ చైర్మన్, వీసీ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 12 : చేజారిన అవకాశం మళ్లీ తిరిగొస్తుంది.. మనలోని శక్తి సామర్థ్యాలను ఎంతటి గడ్డు పరిస్థితుల్లోనూ తక్కువగా అంచనా వేయకుండా సాధించాలనే సంకల్పబలంతోనే ముందుకు సాగాలని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. పీయూలో జరుగుతున్న టీజీ పీఈ సెట్ ఎంపికలకు గురువారం ముఖ్యఅతిథులుగా ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు పురుషోత్తం, శ్రీరామ్ వెంకటేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పరుగు పందెం పోటీలను గాల్లోకి కాల్పులు జరిపి ప్రారంభించారు. తెలంగాణలో వ్యాయామ ఉపాధ్యాయ విద్య ప్రవేశ పరీక్ష (టీజీ పీఈ-సెట్ 2025)లో భాగంగా పాలమూరు యూనివర్సిటీలో అభ్యర్థుల సామర్థ్యాల పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే అభ్యర్థులకు పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్‌తో అభ్యర్థి అభీష్టం మేరకు వారు ఎంచుకున్న ఆటలు క్రికెట్, కబడ్డీ, ఫుట్‌బాల్, తదితర గేమ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీయూ వైస్‌చాన్స్‌లర్ మాట్లాడారు. మొదటి, రెండో రోజు చాలా చక్కగా పారదర్శకంగా ఎంపికలు జరిగాయన్నారు. ఈ సెట్ నిర్వహణ బాధ్యతను అప్పగించిన తెలంగాణ ఉన్నత విద్యామండలికి ధన్యవాదములు తెలిపారు. ఒక అభ్యర్థికి ఛాతిలో నొప్పి వచ్చినట్లు తెలపడంతో ప్రథమ చికిత్స అనంతరం ఆయనను వెంటనే అంబులెన్స్‌లో మెరుగైన వైద్య సేవలకు జిల్లా జనరల్ దవాఖానకు తరలించారు. రెండో రోజు బీపెడ్‌లో 544 మంది విద్యార్థులకు గానూ 370 మంది విద్యార్థులు హాజరయ్యారు. డీపెడ్ కోర్సులో 231 మంది విద్యార్థులకు గానూ 145 మంది విద్యార్థులు హాజరయ్యారు సెట్ కన్వీనర్ దిలీప్, పీయూ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమాల్లో పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, పీయూ పీఆర్వో శేకుంటి రవికుమార్, అధ్యాపకులు జ్ఞానేశ్వర్, వెంకటేశ్‌యాదవ్, అర్జున్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఛాతిలో నొప్పి రావడంతో అభ్యర్థిని అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

వడ్లలో నిలిచిన నీళ్లను చీపురుతో ఊడుస్తున్న మహిళా రైతు

రైతు కష్టం నీటిపాలు

- కొల్లాపూర్‌లో తడిసిన ధాన్యం
- లబోదిబోమంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

కొల్లాపూర్ రూరల్, జూన్ 12 : కొల్లాపూర్‌లో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి మార్కెట్‌లో ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. గురువారం ఉదయం 'నమస్తే తెలంగాణ' మార్కెట్ యార్డును సందర్శించగా తడిసిన ధాన్యం కుప్పలు చూపించి రైతులు బోరున విలపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం విక్రయించేందుకు గత నెలలో కొల్లాపూర్ మార్కెట్ యార్డుకు తీసుకువచ్చామని, అయితే అప్పుడు ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందని కాంటా వేయలేదన్నారు. ధాన్యం తూర్పు పట్టడానికి అధికారులు తూర్పు మిషన్లు తెచ్చి తూర్పుపట్టడంతో మిషన్లలో వడ్ల నూకలు అవుతున్నాయని, ఆ నూకలు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. కొన్ని రోజులుగా మార్కెట్‌లో ఉండి ధాన్యాన్ని ఆరబెట్టినా అధికారులు కాంటా వేయకుండా నిర్లక్ష్యం వహించడంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుప్పలు పోసుకున్న ధాన్యం మొత్తం తడిసి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ కష్టాలు మొదలయ్యాయని, గతంలో కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తే నేడు కల్లాల నుంచి మార్కెట్‌కు, మార్కెట్ నుంచి మిల్లులకు రైతులు వాహనాల్లో తీసుకుపోయినా ధాన్యం కొనే పరిస్థితి లేకుండా పోయిందని ఆరోపించారు. ఇప్పటికే వానకాలం సాగు పనులు ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు స్పందించి ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టడంతోపాటు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

తడిసిన వడ్లను చూపిస్తున్న రైతు

లారీని ఢీ కొట్టిన ఓల్వో బస్సు

- 18 మందికి గాయాలు
- మక్తల్ మండలం నర్సిరెడ్డిపల్లి వద్ద ఘటన

మక్తల్, జూన్ 12 : ఆగి ఉన్న లారీని ఓల్వో బస్సు ఢీకొట్టగా 18 మందికి గాయాలైన ఘటన గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ మండలం నర్సిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని 167 జాతీయ రహదారిపై చోటు చేసుకున్నది. ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం శివ మొగ్గ నుంచి దుర్గాంబ ట్రావెల్ ప్రైవేట్ ఓల్వో బస్సు 29 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బుధవారం మధ్య రాత్రి బయలు దేరింది. గురువారం తెల్లవారు జామున నర్సిరెడ్డిపల్లి సమీపంలో 167 జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో బస్సులోని 18 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే మక్తల్ ప్రభుత్వం దవాఖానకు తరలించగా 18 మందిలో బస్సు డ్రైవర్‌కు రెండు కాళ్లు విరగగా ఏడుగురికి తీవ్ర గాయాలు ఇద్దరిని మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానకు, మిగతా వారిని కర్ణాటకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నుజ్జునుజ్జయిన ఓల్వో బస్సు

తాగునీటి తంటాలు

- మూగోనిపల్లిలో వారం రోజులుగా నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా
- పొలాల్లోని బోరుబావులను ఆశ్రయిస్తున్న ప్రజలు

మూగోనిపల్లిలో తాగునీటిని పొలాల వద్ద నుంచి తెచ్చుకుంటున్న గ్రామస్తులు

అయిజ, జూన్ 12 : మండలంలోని మూగనోనిపల్లిలో ప్రజలకు తాగునీటి కోసం తంటాలు తప్పడంలేదు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోక పోవడంతో ప్రజలు సమీపంలోని రైతుల బోర్లు, బావులను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఇంటింటికీ నీటి సరఫరా చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ హయాంలో ఊరూరికి ఓహెచ్‌ఆర్‌లు నిర్మించి తాగునీటిని పుష్కలంగా అందించినప్పటికీ, నేటి పాలకుల అసమర్థత కారణంగా మిషన్ భగీరథ నీటి సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమవుతున్నది. గ్రామాలకు నీటి సరఫరా చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడంతో పల్లె ప్రజలు తాగునీటి తంటాలు పడాల్సిన పరిస్థితి దాపురించింది. అయిజ మండలంలోని మూగోనిపల్లి గ్రామంలో గత వారం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా కాక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తూ చేసేదిలేక నీటి కోసం రైతుల పొలాల్లోకి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో పంచాయతీ బోర్లున్నా, చేతి పంపులు బిగించడం లేదని, ఈ విషయమై కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. పొలాల్లోని బోర్లు, బావుల దగ్గరకు కిలోమీటరు వెళ్లి నీటి తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరారు.

దంచికొట్టిన వాన

- జలమయంగా మారిన రహదారులు
- లోతట్టుకాలనీల్లో ఇండ్లలోకి వరద నీరు
- ఇబ్బందులు పడ్డ ప్రజలు

మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లాలోని భారీ వర్షం కురిసింది. మహబూబ్‌నగర్‌లో బుధవారం రాత్రి, గురువారం మధ్యాహ్నం దాదాపు రెండు గంటలకు పైగా కురిసిన వర్షంతో మురుగు కాల్వలు పొంగి రహదారులన్నీ జలమయం అయ్యాయి. లోతట్టుకాలనీల్లోని ఇండ్లలోకి వర్షపు నీరు చేరటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జడ్చర్లలో సిగ్నల్‌గడ్డ నుంచి నేతాజీ చౌరస్తా వైపు వెళ్లే నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరటంతో వాహనాల రాక పోకలు స్తంభించిపోయాయి భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలైన మాధవరావు కంపౌండ్ ఏరియా, సాయినగర్, రాజీవ్‌నగర్ కాలనీ, అంబా భవానీ నగర్, వెంకటేశ్వరకాలనీలోకి వరద నీరు చేరటంతో ఆ ప్రాంతవాసులు ఇండ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఊరకుంట చెరువు తూము నుంచి ఒక్కసారిగా వరద నీరు ప్రవహించుంతో పద్మావతి కాలనీ ప్రధాన రహదారిలో మోకాలోతు వరద నీరు ప్రవహించింది. సర్దార్‌వల్లభాయ్‌పటేల్ నగర్‌లో సారమ్మ అనే మహిళ నివాసిస్తున్న ఇంట్లో గోడ,పైకప్పు కూలింది. అయిజ మున్సిపాలిటీలోని పలు కాలనీలు వర్షం నీటితో నిండిపోయాయి. రాయిచూర్ రహదారిలోని ఓ కాలనీ వరద నీటితో ముంచెత్తింది. అక్కడే పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న సంచార జాతులకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాయిచూర్ రహదారిపై ఉన్న కల్వర్టు ఆక్రమణకు గురై మూసుకుపోవడంతో వాన నీరు వాగులు, వంకలకు చేరకుండా అక్కడే నిలిచిపోయింది.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ జూన్ 12

నాగర్‌కర్నూల్‌కు వెళ్లే రోడ్డులో..

కోర్టు ఆవరణలో నిలిచిన వర్షపు నీళ్లు

అయిజలో నిలిచిన నీళ్లు

ఎస్వీపీ నగర్‌కాలనీలో కూలిన ఇల్లు